



### జరిగిన జగన్నాటకం

ఎడమ చేతిని ప్రముఖంగా వాడే సవ్యలంకలో కుడిచేతి పోరాటానికి మహాబసు అనే నాయకుడయ్యాడు బోసు. మరణదండన నుంచి ద్వీప, ఆచార్య వేదాంతం కాపాడారు. రెండుసార్లు దళాధిపతి దాడి నుంచి ఉగ్ర కాపాడాడు. పేరలల్ వరల్డ్స లో ప్రయాణం వల్ల సారథి సవ్యలంకకి వెళ్ళాడని డా. నరసింహం తెలుసుకున్నాడు. మహాబసుపై దళాధిపతి చేసిన దాడిలో సుధాముడు మరణించాడు. వామదేవుడి గూఢచారి ఉదంతుడు మహాబసుని రహస్య మార్గం ద్వారా రాజప్రాసాదంలోకి తీసుకెళ్ళాడు. అక్కడ వామదేవుణ్ణి కలిసాడు మహాబసు. మహాబసు మరణించాడని నమ్మిన ద్వీప ఉద్యమాన్ని ఆపేయాలన్న ప్రయత్నం చెయ్యటం ఉగ్రకు నచ్చటం లేదు. తానే ఆచార్య వేదాంతం అని డాక్టర్ నరసింహం చెప్పాడు.

- 24 –

సారథికి తల తిరిగినట్లు అనిపించింది. ఆ షాక్ నుంచి తేరుకోడానికి చాలాసేపు పట్టింది.

“ఐ యామ్ సారీ.” నెమ్మదిగా అన్నాడు డాక్టర్ నరసింహం. సారథి అతని వైపు తల ఎత్తి చూశాడు కానీ సమాధానం చెప్పలేదు. అలాగే చూస్తూ వుండిపోయాడు.

ఈ ప్రపంచంలో అతని పేరు సారథి. మరో ప్రపంచంలో మహాబసు.

ఈ ప్రపంచంలో ఇతని పేరు డాక్టర్ నరసింహం. మరో ప్రపంచంలో ఆచార్య వేదాంతం.

“ఇది ఎలా సాధ్యమైంది డాక్టర్?” అడిగాడు సారథి చాలా నెమ్మదిగా ధ్వనిస్తున్న గొంతుతో.

డాక్టర్ నరసింహం కూడా దాదాపు అలాంటి గొంతుతోనే సమాధానం చెప్పసాగాడు –

“సారథీ! ఇది ఇలా జరిగిందో నాకు కూడా తెలియదు. నువ్వు మొదట వచ్చి ఈ సంగతులన్నీ చెప్తున్నప్పుడు నేను నిన్ను పేషంట్ గానే చూశాను. ఇదేదో సైకలాజికల్ డిజాడర్ అనుకున్నాను. అలాగే ట్రీట్ చేసే ప్రయత్నం చేశాను. కానీ నువ్వు సవ్యలంక గురించి చెప్తున్నకొద్దీ కొంచెం కొంచెంగా నాలో మార్పు వచ్చింది. మొదట్లో ఏదో దేజావూలా అనిపించేది. నాకు బాగా తెలిసిన ప్రాంతం గురించి నువ్వు మాట్లాడుతున్నట్లు, నాకు బాగా తెలిసిన మనుషుల గురించే చెప్తున్నట్లు అనిపించేది. ఆ తరువాత నేను కూడా సవ్యలంక మనిషినే అన్నట్లు అనిపించసాగింది. ఒకసారి నువ్వు అన్నావు గుర్తుందా? నేను మాట్లాడుతున్నప్పుడు ఒక ఇంగ్లీష్ పదం కూడా రాలేదని? అందుకు కారణం నేను నీ కథలో ఇన్వాల్వ్ అవడం అనుకున్నావు నువ్వు. కానీ నిజం ఏమిటంటే నేను కూడా అక్కడి బాషనే మాట్లాడటం మొదలుపెట్టాను. నేను అక్కడివాడినే అని తెలుసుకున్నాను”

మనసులో ఎన్నో ప్రశ్నలు అలజడి చేస్తుంటే ఏ ప్రశ్న అడగాలో అర్థం కానట్లు చాలాసేపు మౌనంగానే వుండిపోయాడు సారథి. చివరికి చాలా నెమ్మదిగా నోరు విప్పాడు –

“మీకు ఈ విషయం అర్థం అయినట్లే అక్కడ ఆచార్య వేదాంతంకి మీ గురించి తెలుసా?”

“లేదు. నీకూ మహాబసుకి ఎలాంటి సంబంధం వుందో నాకూ వేదాంతంకి కూడా అలాంటి సంబంధమే వుంది. నాకు అక్కడి విషయాలు తెలుస్తుంటాయి. అక్కడ వేదాంతంకి నా సంగతులు తెలియవు”

“అందుకే మీకు ద్వీప సంగతులు తెలిశాయన్నమాట”

“అవును.” అని, కొన్ని క్షణాలు ఆగాడు నరసింహం. “ఇక్కడిదాకా వచ్చింది కాబట్టి నీకు నిజం చెప్పక తప్పటం లేదు. మరీ ముఖ్యంగా నువ్వు ద్వీపని అపార్థం చేసుకోవడం చూస్తున్నాను కాబట్టి చెప్తున్నాను. సవ్యలంకలో నువ్వు కనపడకుండాపోయిన తరువాత నువ్వు మరణించావన్న వార్త దావానంలా వ్యాపించింది. అది నిజమేనని నమ్ముతోంది ద్వీప. నీకు తెలుసు కదా మహాబసు మరణించడమంటే సవ్యలంకవాసులందరికీ, ముఖంగా మన సేనలకి ఒక నమ్మకం కోల్పోవడం. ఒక ఆశని చంపేసుకోవడం. నువ్వు వాళ్ళని ముందుకు నడిపిస్తావనీ, పోరాటంలో గెలిపిస్తావను, తరతరాలుగా వారిపై జరుగుతున్న అత్యాచారాలను అంతమొందిస్తావనీ అనుకున్నారు. నువ్వే లేవు అనుకున్నప్పుడు అవేవీ సాధ్యమవ్వవని అనుకుంటున్నారు. అలాగే ద్వీప కూడా నువ్వు మరణించావు అంటే నువ్వు మహాజ్ఞాన గ్రంధంలో చెప్పబడిన మహాబసువి కాదన్న అనుమానించడం మొదలుపెట్టింది. నువ్వు మహాబసు కాని పక్షంలో నిన్ను నమ్మి ఒక పోరాటాన్ని నడిపించడం సరికాదని అంటోంది. ఎన్నో ప్రాణాలను పణంగా పెట్టడం అనవసరం అని వాదిస్తోంది. పోరాటాన్ని ఆమె ఆపమనడానికి అసలు కారణం అది.”

సారథి ఆశ్చర్యం నుంచి నెమ్మదిగా తేరుకున్నాడు.

“కానీ నేను నిజమైన మహాబసునైన పక్షంలో చనిపోనని, పోరాటం ఆగదనీ ఆమెకు తెలియటాం లేదా?”

“వేదాంతంగా నేను చేసిన పని అదే. ఆమెను అనూనయించాను. నువ్వే మహాబసువని చెప్పి అందుకు నిదర్శనాలు చూపించాను. ముఖ్యంగా మహాబసుతో ఆమె వివాహం జరుగుతుందని మేమంతా నమ్ముతున్నాం కాబట్టి, ఆమెకు దగ్గరైన నువ్వే మహాబసువని చెప్పాను. అప్పుడే ద్వీప

తాను నీకు ఎంత దగ్గరైందో తెలిపింది. అలా ఆమె గర్భవతి అని తెలుసుకున్నాను. నిజానికే అదే ముఖ్యమైన నిదర్శనమని చెప్పాను. మహాబసు ఖచ్చితంగా బ్రతికే వుంటాడని, అతని వివాహం జరిపించే పూచీ నాదని ఆమెకు వాగ్దానం చేశాను."

నరసింహం చెప్పిన ప్రతి విషయం జాగ్రత్తగా విన్నాడు సారథి. ద్వీపని అపార్థం చేసుకున్న సంగతి గ్రహించాడు. కానీ ఆ విషయం మహాబసుకు తెలిసేది అలా అన్న ప్రశ్న అతన్ని ఇబ్బంది పెడుతూనే వుంది.

"మీరు చెప్పిన విషయాన్ని ద్వీప నమ్మి వుంటే ఆమె పోరాటాన్ని కొనసాగించమని చెప్పాలి కానీ, పోరాటాన్ని ఆపమని ఎందుకు చెప్తోంది?" ఉన్నట్టుండి ఆ విషయాన్ని గుర్తించినట్లు అడిగాడు సారథి.

"అదే నాకు కూడా అర్థం కావట్లేదు. ఉగ్ర ఆమెను చంపేస్తానని బయల్దేరి వెళ్ళినవాడు మళ్ళీ తిరిగి వచ్చాడు. ద్వీప చేస్తున్న ప్రచారం పోరాటాన్ని నిర్వీర్యం చేస్తోందని అంటున్నాడు. ద్వీపని బంధించమని అనుచరులకు సూచనలు ఇచ్చాడు"

చురుగ్గా తల ఎత్తాడు సారథి.

"ద్వీపకు హాని చేస్తే పర్యవసానం ఎలా వుంటుందో ఉగ్రకి తెలియదనుకుంటా" అన్నాడు.

"సారథీ, ఆ సంగతి నాకు కూడా తెలుసు. ఆచార్య వేదాంతంగా కూడా నేను ఆ విషయాన్ని అర్థం చేసుకోగలను. కానీ ఉగ్ర ఎంతవరకు వేదాంతం మాట వింటాడో అన్న అనుమానమే వేధిస్తోంది" డాక్టర్ నరసింహం అన్నాడు.

ఇద్దరూ చాలాసేపు మాట్లాడుకోలేదు. ఎవరి ఆలోచనల్లో వాళ్ళు వుండిపోయారు.

"మరి, ఈ విషయం నాకెందుకు చెప్పలేదు?" నిశబ్దాన్ని ఛేదిస్తూ అడిగాడు సారథి.

"ఏ విషయం?"

"మీరే వేదాంతం అన్న విషయం"

డాక్టర్ నరసింహం సమాధానం చెప్పడానికి చాలాసేపు తటపటాయించాడు. చివరికి నెమ్మదిగా అన్నాడు.

"నువ్వు అక్కడికి రావటానికి కారణం నేనే. అంటే ఆచార్య వేదాంతంగా నేనే నిన్ను ఆ లోకంలోకి వచ్చేలా చేశాను. ఆ విషయం నాకు అర్థమైన మరుక్షణం నీకు చెప్పకూడదని నిర్ణయించుకున్నాను."

"కానీ అదెలా సాధ్యం. నేను సవ్యలంక చేరడానికి కారణం మీరా? ఎందుకు? ఎందుకు నన్ను ఆ ప్రపంచంలోకి లాగారు? ఎందుకు నన్ను ఈ తీవ్రమైన మానసిక వత్తిడికి గురి చేశారు? రెండు ప్రపంచాల మధ్య ఇలా నలిగిపోతున్నానని తెలిసి కూడా నాకు సహాయం చెయ్యాలని అనిపించలేదా? చెప్పండి డాక్టర్ నర... ఆచార్య వేదాంతం" తీవ్రంగా ప్రశ్నించాడు సారథి అని పిలవబడే మహాబసు.

<>

ఉగ్ర పేరుకు తగ్గట్టే వున్నాడు. అసహనంగా అటూ ఇటూ పచార్లు చేస్తున్నాడు. పిడికిళ్ళు బిగిస్తున్నాడు. పళ్ళు పటపటా కొరుకుతున్నాడు. సరిగ్గా అలాంటి సమయంలోనే లోపలికి అడుగుపెట్టాడు ఆచార్య వేదాంతం.

"ఏమిటి ఏదో సమావేశం ఏర్పాటు చేయమని చెప్పావట" అన్నాడాయన వస్తూనే. ఆ తరువాత వెంటనే ఉగ్రని గమనించాడు. "ఏమిటి ఏదో అసహనంగా వున్నట్లున్నావ్" అడిగాడు.

"అవును ఆచార్యా... అసహనంగానే వున్నాను. ఆశయసాధన అడుగు దూరంలో వుందనిపిస్తుంటే ఇప్పుడు మొత్తం ఉద్యమమే నీరు కారిపోయే స్థితి కనిపిస్తోంది. మహాబసు చనిపోయాడన్న వార్త ఒక వైపు, చనిపోయిన మాటే నిజమైతే అతను మహాబసే కాదన్న వాదన ఇంకోవైపు మనవాళ్ళ స్థైర్యాన్ని దెబ్బతీస్తున్నాయి. ఇలాంటి సందర్భంలో ఉద్యమానికి ఊతమివ్వాల్సింది పోయి మనకి వ్యతిరేకంగా ప్రచారం చేస్తోంది మీ ప్రియ శిష్యురాలు ద్వీప!" కసిగా పలికాడా పేరుని.

"ద్వీప చేస్తున్న ప్రచారాం గురించి నాకు కూడా తెలిసింది ఉగ్రా. ఆమెకు సర్ది చెప్పే ప్రయత్నం కూడా చేశాను. ఆమె మానసికంగా భర్తగా ఊహించుకున్న మహాబసు మరణం ఆమె అలా మాట్లాడేలా చేస్తోంది కానీ వేరేదేదీ కాదు"

"కానీ ఆమె చేస్తోంది ఉద్యమకి ద్రోహం. నమ్మిన సిద్ధాంతాలకు వెన్నుపోటు"

"ఆమె ఒంటరి. ఆమె చేసే ప్రచారం నిజంగా ఉద్యమాన్ని బలహీనపరిచేదిగా వుందంటావా ఉగ్రా?" వాదన కన్నా ద్వీపని ఎలాగైనా కాపాడాలన్న ప్రయత్నమే కనపడుతోంది ఆయన మాటల్లో.

"ఆచార్యా! ఆమె ప్రయత్నం చిన్నదే కావచ్చు, కానీ మన ఉద్యమం కూడా ఒకప్పుడు ఇంతే చిన్నదిగా మొదలైన సంగతి మర్చిపోకండి. నేను స్వయంగా ఆమె మాట్లాడిన మాటల్ని విన్నాను. ఒక్క క్షణం ఆమె చెప్పినవి విని ఉద్యమం మొదలుపెట్టి తప్పు చేశామా అనిపించింది. నాకే అస్త్రసన్యాసం చెయ్యాలనిపించింది. నన్నే అంత ప్రభావం చేయగలిగిందంటే ఇంక మిగిలిన వారు సంగతేమౌతుందో ఊహించండి" చెప్పాడతను.

పరిస్థితి చెయ్యిదాటిందని అర్థమైంది వేదాంతానికి.

"నేను సర్ది చెప్తాను" అన్నాడు

"అవసరం లేదు. ఉద్యమానికి వ్యతిరేకంగా పనిచేస్తున్న నేరానికి ద్వీపని నేను బంధించమని ఆదేశించాను" కఠినంగా వున్న సూటిగా చెప్పాడు ఉగ్ర. ఆచార్య వేదాంతం హతాశుడయ్యాడు. ఏదైతే జరగకూడదని అనుకున్నాడో అదే జరిగింది. ఆ పై మాట్లాడలేక ఊరకుండిపోయాడాయన.

ఒక్కొక్కరుగా సైన్యాధ్యక్షులు, దండనాయకులు సమావేశ మందిరానికి వచ్చారు. వచ్చిన వారంతా ఆశీనులు అయిన తరువాత వాళ్ళని ఉద్దేశ్శించి ప్రసంగాన్ని మొదలుపెట్టాడు –

"మిత్రులారా! మరొక్క అడుగు ముందుకు వెయ్యాలి మనం. మరొక్క అడుగు" ఒక్క క్షణం ఆగాడతను. అతను దేని గురించి మాట్లాడబోతున్నాడో అర్థం కాక అందరూ ఆసక్తిగా చూస్తున్నారు.

"అవును మిత్రులారా. మనకి కావాల్సింది మరొక్క అడుగు. మన ఉద్యమం ఒక పర్వతారోహణ అనుకుంటే మనం ఇప్పుడు నిలబడ్డది శిఖరాగ్రానికి ఒక్క అడుగు దూరంలో. ఆ ఒక్క అడుగే మన జీవితాలని దారిలో పెడుతుంది. ఆ ఒక్క అడుగే ఇన్నాళ్ళ మన బానిసత్వాన్ని రూపుమాపుతుంది. మనకోసం, మన ముందు తరాలకోసం వెయ్యాల్సిన ఆ ఒక్క అడుగు. ఇన్నాళ్ళు కలిసి నడిచాం. కలిసి చావటానికి సిద్ధపడ్డాము. కానీ ఈ ఒక్క అడుగు దగ్గర ఎందుకు వెనకాడుతున్నారు? ఎందుకు ఈ ఒక్క అడుగు ముందుకు పడటం లేదు?" అంటూ ఇంకా ఏదో చెప్పబోయాడు ఉగ్ర,

జనంలో కలకలం. ఉగ్ర తన ప్రసంగాన్ని ఆపి కలకలం జరిగిన వైపు చూశాడు. నిలబడ్డవాళ్ళు ఒక్కొక్కళ్ళే తప్పుకుంటున్నారు. వారి మధ్యలో నుంచి ముందుకు నడుచుకుంటూ వచ్చింది ద్వీప. ఆమె చేతులకి సంకెళ్ళు వేసి వున్నాయి.

ఆమెను చూస్తూనే దగ్గరకు వెళ్ళాలనిపించినా ఆ ఆలోచనను బలవంతంగా విరమించుకున్నాడు వేదాంతం.

అయినా నిర్భయంగానే వుంది ద్వీప. చుట్టూ పరికించి చూసింది.

"అభినందనలు ఉగ్రా" అంటూ గట్టిగా అరిచింది.

"కారణం?" అడిగాడు ఉగ్ర

"మళ్ళీ అధికారం చేతిలోకి వచ్చినందుకు. ఉద్యమసహచరులని కూడా బంధించే స్థాయికి ఎదిగినందుకు" ఆమె గొంతులో నిరసన, ద్వేషం వ్యంగ్యం రూపంలో వినపడింది.

"ఉద్యమసహచరి!" నిరసనగా నిట్టూర్చాడు ఉగ్ర – "ఉద్యమ సహచరివే అయితే ఈ రోజు నువ్వు నా పక్కన నిలబడి ఉండేదానివి. యుద్ధానికి సన్నద్ధమై ఉండేదానివి. ఇలా పిరికిదానిలా పోరాటం వద్దని చెప్పే దీనస్థితికి దిగజారేదానివి కాదు. ఇప్పుడు నువ్వు చేస్తున్న పని ఉద్యమ వ్యతిరేకోద్యమం. అందువల్ల నువ్వు ఉద్యమ సహచరివి కాదు, ఉద్యమ ద్రోహివి. అందుకే నిన్ను బంధించాము. ఉద్యమ ద్రోహానికి శిక్షేమిటో తెలుసా? మరణశిక్ష" చెప్పాడు ఉగ్ర.

"ఏ రోజైతే ఈ పోరాటంలో భాగమవ్వాలని అనుకున్నానో ఆ రోజే ప్రాణాల మీద తీపి వదులుకున్నాను. నా ప్రాణాలను కాపాడుకోవాలన్న కోరికే వుంటే ఇలా పదిమందిని ముందు నిలబడి ఈ యుద్ధం వద్దని ప్రకటించేదానిని కాదు. ఇప్పుడు నువ్వు కొత్తగా మరణదండన అని చెప్పినంత మాత్రాన భయపడతానని అనుకోకు" కరకుగా చెపింది

"నువ్వు భయపడ్డా, భయపడకపోయినా చేసిన అతిక్రమణకి శిక్ష తప్పదు" ఉగ్ర మాటలు విన గట్టిగా నవ్వింది ద్వీప. తెరలు తెరలు, ఆగకుండా చాలాసేపు నవ్విందామే.

"కారణం చెప్పి నవ్వు" ఆదే కరకుదనంతో అడిగాడు ఉగ్ర.

"ఇప్పుడు నువ్వు అన్న మాట – అతిక్రమణ – విన్న తరివాత నాకు నవ్వు ఆగటంలేదు. మన ఉద్యమమే అతిక్రమణ మీద ఆధారపడింది. ఎడమ చేతిని వాడే చోట కుడి చేతిని వాడాలని అనటంలోనే వుంది కదా అతిక్రమణ. ఆ అతిక్రమణ సబబు, సమంజసం, ఈ అతిక్రమణ నేరం, శిక్షార్హం. నవ్వు రాదా ఇదంతా చూస్తుంటే"

వేదాంతం అంత ఉత్కంఠలోనూ చిన్నగా నవ్వుకున్నాడు. ఉగ్ర అహం దెబ్బతిన్నది.

"మాటలతో మభ్యపెట్టి మరణాన్ని తప్పించుకోలేవు. ద్రోహీ" అన్నాడు.

"ఏ కారణంతో నన్ను ద్రోహి అంటున్నావు?" అడిగిందామె.

"మహాబసు మరణించాడన్న పుకారు వ్యాప్తి చేస్తున్నావు. పోరాటం చెయ్యొద్దని ప్రేరేపిస్తున్నావు. అంతకన్నా ఇంకేం కావాలి" ప్రశ్నకు ప్రశ్నే జవాబు ఇచ్చాడు ఉగ్ర.

"మహాబసు మరణించలేదని చెప్పడానికి నీ దగ్గర సాక్ష్యం వుందా?" ద్వీప ఉగ్రని అడిగింది.

ఉగ్ర దగ్గర సమాధానం లేదు.

"మరణించాడని చెప్పడానికి చాలా మంది వున్నారు. నీకు గుర్తుండే వుంటుంది. వేగులు, మన సైనికులు ఈ విషయాన్ని మన ముందే కదా ప్రకటించారు. ఇక పోరాటం గురించి. మహాబసు మరణించాడని నమ్ముతున్నాను నేను. అదే నిజమైతే చనిపోయిన వ్యక్తి మహాబసే కాదన్నది నా వాదన. మహాబసు అయితే చనిపోయేవాడు కాదు. మహాజ్ఞాన గ్రంథం చెప్పిన మహాబసు ఇతనే అయితే ఉద్యమం ఆగదు. అతనిని మరణం తాకదు. మహాబసు కాని వ్యక్తిని మహాబసే అనుకొని యుద్ధం ముందు నిలబెడితే, గెలిచే అవకాశం ఎలాగూ లేదు. అదనంగా మన సైనికుల ప్రాణాలు ప్రమాదంలో పడుతున్నాయి. అందుకే వద్దంటున్నాను." చెప్పిందామె.

<★★★>

(జరగబోయే జగన్నాటకం వచ్చే మాసం)

COMMENTS